

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌లో ఏపీకి ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించలేదని వివిధ రాజకీయ పార్టీల నాయకులు అంటున్నారు. అయితే ఇది పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరట కల్పించేలా ఉందనే అభిప్రాయం ఉంది. మధ్య తరగతి ప్రజల్లో ఏడాదికి రూ. 12 లక్షల ఆదాయం ఉన్న వారికి బడ్జెట్‌లో పన్నుల నుంచి మినహాయింపు కల్పించారు. అద్దె భవన యజమానులకు ఏడాదికి రూ. 2.40 లక్షలు మించితే 10శాతం టీడీఎస్ ఉండేది. తాజా బడ్జెట్‌లో ఈ పరిమితిని రూ. 6లక్షలకు పెంచడంతో ఆయా వర్గాలకు భారీగా ఉపశమనం కలిగినట్లైంది. ఇదే తరహాలో రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డు రుణపరిమితి రూ. 3 లక్షల నుంచి రూ. 5 లక్షలకు పెంచారు. రైతులు, జాలరులు, పాడిరైతులకు ఎంతో మేలు కలగనుంది.గతంలో ఎన్నడూ లేని విధంగా షెడ్యూల్డు కులాలు, తెగలకు చెందిన మహిళల కోసం టర్మ్ లోన్ పథకాన్ని ప్రకటించారు. అయితే జిల్లాకు మాత్రం ప్రత్యేక బడ్జెట్ కేటాయించకపోవడంతో కొంత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ప్రధాన మంత్రి నరేంద్రమోదీతో ఉన్న సాన్నిహిత్యం వల్ల భవిష్యత్‌లో వివిధ రూపాల్లో ఏపీకి, జిల్లాకు కూడా ప్రత్యేక నిధులు తీసుకొచ్చే అవకాశం ఉందని టీడీపీ, జనసేన నాయకులు అంటున్నారు.

నంద్యాల, ఫిబ్రవరి 1, (ఆంధ్రజ్యోతి) :

పేద, మధ్య తరగతికి ఊరట..!

- రూ. 12 లక్షల ఆదాయం ఉంటే పన్ను మినహాయింపు
- అద్దె భవనాల యజమానులకు వెసులుబాటు
- రైతులకు ఊరటగా రుణ పరిమితి పెంపు
- కేంద్ర బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు
- జిల్లాకు కేటాయింపులు లేకపోవడంపై అసంతృప్తి

ఉద్యోగులకు శుభవార్త చెప్పిన నిర్మలమ్మ

కేంద్ర బడ్జెట్-2025-26లో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజలకు తీపి కబురు చెప్పారు. రూ.12 లక్షల వరకు ఎలాంటి పన్నులు చెల్లించకుండా రిబేట్ ప్రకటించారు. పన్ను స్లాబులు మార్చారు. రూ.75 వేలు స్టాండర్డ్ డిడక్షన్ చెల్లిస్తే రూ.12.75 లక్షల వరకు పన్ను ఉండదని అంటున్నారు. జిల్లాలో వివిధ శాఖల్లో దాదాపుగా 45 వేల మందికిపైగా ఉద్యోగులు ఉన్నారు. వీరిలో 60 శాతం మంది పన్నులు చెల్లించేవారున్నారు. అదే క్రమంలో వివిధ వ్యాపారాలు చేస్తూ ఆదాయ పన్ను పరిధిలోకి వస్తున్న మధ్య తరగతి ప్రజలు లక్ష కుటుంబాల వరకు ఉంటాయని అంచనా. దేశ వ్యాప్తంగా వైద్య విద్యా సీట్లు పెంచుతామని నిర్మలమ్మ ప్రకటించారు. జిల్లాలో నంద్యాల మెడికల్ కళాశాలలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్తగా సీట్లు అందుబాటులోకి వస్తాయని విద్యార్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అదే క్రమంలో కర్నూలు మెడికల్ కాలేజీలో కూడా పీజీ సీట్లు పెరగవచ్చని అంటున్నారు.



నిరుద్యోగులు, రైతులకు నిరాశ



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రైవేట్ రంగానికి పెట్టుబడులు పెంచి ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసింది. కేవలం రూ. 5 వేల కోట్ల కేటాయిస్తే.. పోలవరం ప్రాజెక్టు ఎప్పటికి పూర్తి అవుతుంది?

-లక్ష్మీ నరసింహయాదవ్, నంద్యాల పార్లమెంట్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు

ఇది అంకెల గారడీ బడ్జెట్



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీ బడ్జెట్. కొత్త సీసాలో పాత సారా. ఢిల్లీ, బీహార్ ఎన్నికలను దృష్టితో పెట్టుకుని ట్యాక్స్ పేయర్లకు ఊరట కల్పించారు.

-చాకలి పుల్లయ్య, నంద్యాల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి

కూటమి విజయం..



కేంద్రం విడుదల చేసి బడ్జెట్‌లో ఏపీలోని పోలవరం, సేంద్రియ వ్యవసాయం, విశాఖ ఉక్కు మొదలైన వాటికి కేటాయింపులు ఉన్నాయి. ఇది కూటమి సర్కార్ విజయం.

-మారాసు గురుబాబు, నంద్యాల జనసేన నాయకుడు

పేదలకు గుదిబండ



కేంద్ర బడ్జెట్ పేదవారికి గుదిబండ. రాష్ట్రానికి నిధులు తేవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. విశాఖ ఉక్కుపై తూతూ మంత్రంగా నిధులు విడుదల చేశారు.

- రంగనాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి

ఇది బీహార్ ఎన్నికల గారడీ బడ్జెట్



బీహార్ ఎన్నికల నేపథ్యంలోనే ట్యాక్స్ పేయర్లకు ఊరట కల్పించేలా కేంద్రం తాజా బడ్జెట్ విడుదల చేసింది. కార్పొరేట్ పెట్టుబడిదారులకు 84శాతం కల్పించిన రాయితీ ప్రజల రుణమాఫీ పథకాలకు ఇచ్చిఉంటే బాగుండేది.

- రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగరాజు (సీపీఎం)

రైతులకు భరోసా

జిల్లాలో 9 లక్షలకు పైగా రైతు కుటుంబాలు ఉన్నాయి. సేద్యం చేయాలంటే పెట్టుబడి కోసం అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సి వస్తుంది. దీంతో రైతులు అప్పుల



ఊబిలో కూరుకుపోయి తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. అయితే ప్రస్తుతం కిసాన్ క్రెడిట్ కార్డు పరిమిత రూ.3 లక్షలు ఉండేది. దీనిని రూ.5 లక్షలకు పెంచారు. వ్యవసాయం, అనుబంధ రంగాలపై ఆధారపడిన రైతులకు తక్కువ వడ్డీలకు స్వల్పకాలిక రుణాలు పొందేందుకు అవకాశం కలిగింది.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి: కలెక్టర్



వర్చువల్‌గా సచివాలయ సిబ్బందితో సమీక్షిస్తున్న కలెక్టర్

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మన మిత్ర పేరుతో వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా మెరుగైన సేవలు అందించడానికి సిద్ధం కావాలని కలెక్టర్ రాజకుమారి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. నంద్యాల కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అర్బన్ సచివాలయ సిబ్బందితో కలెక్టర్ సమీక్షించారు. జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, డీఎల్‌డీవో శివారెడ్డి, పరిశ్రమల జిల్లా మేనేజర్ జవహర్ బాబు తదితరులు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వ సేవలు అందించేందుకు మనమిత్రపేరుతో ప్రభుత్వం లాంచనంగా ప్రారంభించిందని, ఇందుకోసం 9552300009 మొబైల్ నెంబర్ వాట్సాప్ ద్వారా ప్రభుత్వ సేవలను అందించేందుకు సిద్ధం కావాలని తెలిపారు. ప్రస్తుతం దేవదాయ, పీజీఆర్ఎస్ ఏపీఎస్ ఆర్టీసీ, ఎనర్జీ సర్వీసెస్, మునిసిపల్, రెవెన్యూ, ఆరోగ్య, పోలీస్ శాఖలకు సంబంధించిన సేవలను ప్రారంభించారని, వాట్సాప్ ద్వారానే సర్వీసులను అందించాల్సి ఉంటుందని అన్నారు. జిల్లాలో తొమ్మిది రకాల సర్వేలను సచివాలయ సిబ్బంది చేస్తున్న నేపథ్యంలో డేటాబేస్ పక్కాగా ఉంటే పాలన సంస్కరణలకు ఉపయోగపడుతుందని, తప్పుడు డేటాను నమోదు చేయడం వల్ల సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. విద్యుత్ కమర్షియల్ కనెక్షన్ ఉన్న ప్రతి సంస్థను కూడా ఎంఎస్ఎంఈ యూనిట్‌గా పరిగణించి సర్వే నిర్వహించాలన్నారు.

ఆక్రమణలపై కలెక్టర్ సీరియస్

- త్వరగా సమగ్ర నివేదిక అందజేయండి
- అధికారులకు ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నంద్యాల, ఫిబ్రవరి1, ఆంధ్రజ్యోతి: అవినీతి అక్రమాలకు పాల్పడిన వారిపై కలెక్టర్ రాజకుమారి సీరియస్ అయ్యారు. ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురించిన 'ఏకమై..కాజేశారు', 'దర్జాగా కబ్జా' అనే కథనాలపై ఆమె స్పందించారు. ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలోని రుద్రవరం మేజర్ పంచాయతీలో జరిగిన అక్రమాలపై తక్షణమే సమగ్ర నివేదిక అందజేయాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) షేక్ జమీఉల్లాను ఆదేశించారు. అదేవిధంగా బనగానపల్లెలో నిర్మించిన దిక్లాక్ మర్చంట్ అసోసియేషన్ రెసిడెన్సీ భవనానికి సంబంధించిన సమగ్ర నివేదికను కూడా త్వరగా అందజేయాలని ఆర్డీఓ నరసింహులు, తహసీల్దార్ నారాయణరెడ్డిని ఆదేశించారు. దీంతో ఆయా అధికారుల్లో ఆయా పనుల్లో నిమగ్నమయ్యారు. అతి త్వరలోనే నివేదికను అందజేస్తామని అధికారులు వెల్లడించారు.

4న రథసప్తమి వేడుకలు

శ్రీశైలం(ఆత్మకూరు), ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో ఈ నెల 4వ తేదీన రథసప్తమి వేడుకలను నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రథసప్తమి వేడుకల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవీ అలంకార మండపంలో సూర్యారాధన నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా సూర్యయంత్ర పూజ, చతుర్వే పారాయణాలు, అరుణపారాచణాలు నిర్వహించను న్నారు. మధ్యాహ్నం 12.00 గంటలకు సూర్యభగవానుడికి ఉత్తర పూజ నం, నివేదన, మంత్రపుష్పం వంటి పూజాక్రతువులను జరిపించను న్నారు. కాగా సూర్యారాధన వల్ల ఆనారోగ్యం తొలగి ఆరోగ్యవంతంగా ఉంటారని పురాణాలు తెలలియజేస్తున్నాయి.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

వైసీపీ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి



సమావేశమైన వైసీపీ నాయకులు

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి నుంచి వైసీపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా కో ఆర్డినేటర్ పెద్ది రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నంద్యాల వైసీపీ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి, కార్యవర్గంతో పెద్దిరెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ బలోపేతానికి పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం నంద్యాలలో ఐదో తేదీన జరిగే ఫీజు పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాబున్నీసా, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, కీలక నాయకులు గంగుల ప్రభాకర్ రెడ్డి, కాటసాని రామిరెడ్డి, శిల్పారవిచ్రంద కిషోర్ రెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి, భూమా కిషోర్ రెడ్డి, డాక్టర్ శశికళా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం

మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి




బనగానపల్లె, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం ఇచ్చారని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం కేంద్ర బడ్జెట్‌పై మంత్రి మాట్లాడుతూ రూ.12 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు ఇవ్వడం మధ్యతరగతి ప్రజలకు, ఉద్యోగులకు గొప్ప ఊరట అన్నారు. ఇది మధ్య తరగతి కొనుగోలు శక్తి పెరిగి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తోందని తెలిపారు. కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితి రూ.5 లక్షలకు పెంచడం ద్వారా కేంద్రంలోని కూటమి ప్రభుత్వం రైతులకు ఇస్తున్న ప్రాధాన్యత అర్థమవుతోందన్నారు. పోలవరకు ప్రాజెక్టుకు 5,936 కోట్లు, పోలవరం నిర్మాణానికి బ్యాలెన్సు గ్రాంట్ రూ.12,157 కోట్లు, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రూ.3295 కోట్లు కేటాయించి ఏపీకి కేంద్రం ప్రాధాన్యత ఇచ్చిందని తెలిపారు. విశాఖ పోర్టుకు రూ.730 కోట్లు, ఏపీలో రోడ్లు, వంతెల నిర్మాణానికి రూ.240 కోట్లు, ప్రదాని మోదీ, ఆర్థిక మంత్రి కేటాయించడం హర్షించదగ్గ విషయమని అన్నారు.

వసంత పంచమికి ముస్తాబైన కొలనుభారతి క్షేత్రం



- నేడు అమ్మవారి జన్మదిన వేడుకలు
- 25 వేల మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం
- శ్రీశైలం నుంచి అమ్మవారికి పట్టువస్త్రాలు

ఆత్మకూరు/కొత్తపలి, ఫిబ్రవరి 1, (ఆంధ్రజ్యోతి): నల్లమలలో కొలువైన కొలనుభారతి క్షేత్రం ఆదివారం(నేడు) జరిగే వసంత పంచమి వేడుకలకు ముస్తాబైంది. వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి, జిల్లా దేవదాయ శాఖ అధికారి మోహన్ తహసీల్దార్ ఉమారాణి, ఆత్మకూరు సీఐ సురేష్ కుమార్ రెడ్డితో పాటు మండలంలోని ఆయా శాఖ అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆర్డీవో విలేకరులతో మాట్లాడుతూ అమ్మవారి జన్మదిన వేడుకలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి లోట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున 5 గంటలకే శ్రీశైలం నుంచి అమ్మవారికి తీసుకువచ్చే పట్టువస్త్రాలను నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అందజేస్తారని తెలిపారు. భక్తులకు తాగునీరు, ఆత్మకూరు నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. అలాగే ప్రత్యేక అక్షరాభ్యాస కేంద్రాలు, క్యూలైన్లు ప్రత్యేక చలువ పందిళ్లు, వీఐపీల వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. ఈ వేడుకలకు సుమారు 25వేల మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో అందుకు తగ్గ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. 50 మంది దాకా పోలీసులను బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఇదిలా ఉండగా అక్షరభ్యాసానికి 15 మంది పురోహితులు అందుబాటులో ఉంటారని ఆలయ ఈవో రామలింగారెడ్డి తెలిపారు. భక్తులకు కాశిరెడ్డినాయన, శ్రీవాసవీ అన్నదాన సత్రాల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా భక్తుల కోసం ఉచిత వైద్యశిబిరాన్ని అందుబాటులో ఉంచనున్నట్లు వివరించారు.



భక్తులకు ఏలోటూ రాకూడదు

- ఈవో శ్రీనివాసరావు
- మహా శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన



క్యూకాంప్లెక్స్‌లను పరిశీలిస్తున్న ఈవో శ్రీనివాసరావు

శ్రీశైలం(ఆత్మకూరు), ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో ఫిబ్రవరి 19 నుంచి మార్చి 1 వరకు జరిగే మహా శివరాత్రి ఉత్సవాలకు తరలి వచ్చే భక్తులకు ఏలోటూ రాకూడదని దేవస్థానం ఈవో శ్రీనివాసరావు అన్నారు. శనివారం క్షేత్ర పరిధిలో జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ప్రత్యేకించి లడ్డూ ప్రసాద విక్రయ కేంద్రాలు, క్యూలైన్లు, పార్కింగ్ ప్రదేశాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల రద్దీ దృష్ట్యా ఉన్న 15 లడ్డూ ప్రసాద విక్రయ కేంద్రాలతోపాటు అదనంగా మరో 8 కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు.. ఇందులో దివ్యాంగులు, 60 ఏళ్ల పైబడిన వృద్ధులకు ప్రత్యేక కౌంటర్లను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రసాద విక్రయ కేంద్రాల వద్ద తగు సూచనల బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులు కోరినన్ని లడ్డూలు ఇచ్చేలా ప్రసాదాలను సిద్ధంగా ఉంచాలని చెప్పారు. లడ్డూ ప్రసాద తయారీలో నాణ్యతతోపాటు శుచి, శుభ్రత పాటించాలని ఆదేశించారు. అదేవిధంగా క్యూలైన్లలో తొక్కిసలాట లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్యూకాంప్లెక్స్, క్యూలైన్లలో వాటర్ పాయింట్లను ఏర్పాటు చేసి సజావుగా నీటి సరఫరా జరిగేలా చూడాలన్నారు. పార్కింగ్ ప్రదేశాల్లో విద్యుద్దీకరణతో పాటు తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్ల సదుపాయం కల్పించాలన్నారు. పార్కింగ్ ప్రదేశాల వద్ద కూడా సమాచార కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈయన వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మురళీబాలకృష్ణ, నరసింహారెడ్డి ఉన్నారు.


కందుల కొనుగోళ్లు ప్రారంభం

- దళారులను నమ్మి నష్టపోవద్దు
- కర్నూలు డీసీఎంఎస్ అధికారి రాజు

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులోని డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రంలో కర్నూలు, కల్లూరు మండలాల రైతులు కందుల విక్రయానికి తమ పేర్లను నమోదు చేసుకుంటున్నారు. ప్రభుత్వం క్వింటం కందులకు రూ.7,550కు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకోవడంతో మార్క్‌ఫెడ్ సంస్థ వారం కింద డీసీఎంఎస్ కేంద్రాల ద్వారా రైతుల నుంచి కందుల కొనుగోలుకు శ్రీకారం చుట్టింది. దీంతో రైతులు శనివారం కర్నూలు మార్కెట్ యార్డులోని డీసీఎంఎస్ కేంద్రంలో కందుల విక్రయం వివరాలు అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ అధికారులు రాజు, సంతోష్, విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కందుల ధర క్వింటానికి రూ.7,200 మాత్రమే లభిస్తోందని, దీని వల్ల రైతులు నష్టపోతున్నారని, వారి పరిస్థితిని గుర్తించి కేంద్ర సంస్థ నాఫెడ్ రైతుల నుంచి కొనుగోలు వెంటనే ప్రారంభించాలని ఆదేశించినట్లు తెలిపారు.

తుంగభద్ర తీరం

సాహిత్యం



ఒక దార్శనికుడి ఆత్మకథ

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): 'భారతీయ యువత ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య ఒక దార్శనిక స్పష్టత లేకపోవడం. ఒక దిశా నిర్దేశం లేకపోవడం. ఆ సందర్భంగానే నేను నా జీవితాన్ని తీర్చిదిద్దిన మహనీయుల గురించి, పరిస్థితుల గురించి రాయాలనుకున్నాను. అంతేతప్ప ఈ సందర్భంగా కొందరికి నివాళి ఇవ్వడానికి గానీ, లేదా నా జీవితాన్ని ఎత్తి చూపుకోవడానికి గానీ కాదు' అంటారు 'ఒక విజేత ఆత్మకథ' పుస్తకంలో మాజీ భారత రాష్ట్రపతి, దివంగత ఏపీజే అబ్దుల్ కలాం. ఆయన తన ఆత్మకథగా రాసుకున్న 'ది వింగ్స్ ఆఫ్ ఫైర్' తెలుగులో 'ఒక విజేత ఆత్మకథ' రూపంలో వచ్చింది. 2002లో ప్రథమ ముద్రణగా వచ్చిన ఈ పుస్తకం 2016లోనే 15వ ముద్రణగా విడుదలైంది. ఇప్పుడు ఆ సంఖ్య దాటి ఉండవచ్చు. ది వింగ్స్ ఆఫ్ ఫైర్‌కు ప్రముఖ కథా, నవలా రచయిత వాడ్రేవు చినవీరభద్రుడు తెలుగు అనువాదం చేశారు.

కలాం జీవితం...యువతకు స్ఫూర్తిదాయకం

అవుల్ పకీర్ జైనులాబ్దీన్ అబ్దుల్ కలాం భారతీయ సంస్కృతిలో ఉన్నత విలువలకు సజీవ ప్రతీకగా నిలుస్తారు. ఆయన 1931లో తమిళనాడులోని రామేశ్వరంలో సామాన్య కుటుంబంలో జన్మించారు. 'కలలు కనండి...వాటిని సాకారం చేసుకునే దిశగా కృషి చేయండి' అని యువతకు ఉద్బోధించిన కలాం రక్షణ శాస్త్రవేత్తగా అద్వితీయ సేవలు అందించారు. దేశరక్షణ, పరిశోధన, అభివృద్ధి కార్యక్రమం ప్రధాన బాధ్యతగా కలాం అత్యంత క్రియాశీలమైన ఆవిష్కరణలకు దారి తీశారు. జవ సత్వాలు ఉడిగినట్లుగా భావించబడిన పరిశోధనా సంస్థలకు ఆయన ప్రాణం పోశారు. అనామక గ్రామీణ బాల్యం నుంచి ఆయన తన వ్యక్తిగత, వృత్తిపరమైన పోరాటాలలో విజయపథం వైపు ఏవిధంగా నడిచారో చిత్రించే కథ ఇది. నేడు దేశంలో ప్రతి ఇంటా వినిపించే అగ్ని, పృథ్వి, ఆకాశ్, త్రిశూల్, నాగ్ వంటి క్షిపణుల కథ కూడా ఇది. ఒక జాతి అంతర్జాతీయ స్థాయి క్షిపణి శక్తిగా రూపొందిన కథ కూడా ఇదే. ఈ పుస్తకాన్ని భారత రత్న కలాం అరుణ్ తివారితో కలిసి రాశారు. తివారి కూడా హైదరాబాదులోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లేబరేటరీలో ఒక దశాబ్దం పైగా కలాం నేతృత్వంలో పనిచేశారు. ఈ పుస్తకంలో కలాం ఒక చోట ఇలా అంటారు.. 'తమని తాము మలుచుకోవడానికి నా జీవితం ఎవరికన్నా ఆదర్శప్రాయమనేటంత ఆలోచన నాకు లేదు. కానీ ఎక్కడన్నా ఒక బీద విద్యార్థి ఏ మారుమూలనో ఒక నిర్భాగ్య సామాజిక స్థితిలో ఉంటున్నవా డెవడైనా ఈ కథ చదివి ఎంతో కొంత ఓదార్పు పొందుతాడని నా ఆశ. అటువంటి పిల్లలు తమ మిథ్యాత్మక దాస్యం నుంచీ, బంధనాల నుంచీ విడివడటానికి నా జీవితయాత్రా కథనం ఏమేరకో సహకరి స్తుందని నమ్ముమ్మతున్నాను' అని అంటారు. ఇది మహోన్నత విజ్ఞాన వంతుడైన ఆయనలోని నిరాడంబరతకు అక్షర సత్యంగా నిలుస్తుంది. ప్రతి విద్యార్థి, యువత తప్పనిసరిగా చదవాల్సిన ఈ పుస్తకం వివిధ భాషల్లోనూ అనువాదం అయింది. ఎమెస్కో ప్రచురణ కర్తలుగా ఉన్న ఈ పుస్తకం అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాల్లో లభిస్తుంది.

ఆగిన బిల్వ స్వరం

ప్రముఖ పౌరాణిక నటుడు బీసీ కృష్ణ కన్నుమూత



కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): బీసీ కృష్ణ అంటే బిల్వ మంగళుడు. చింతామణిలోని ఈ కీలక పాత్రకు రక్తమాంసాల ప్రతిరూపంగా ఆయన సుప్రసిద్ధుడు. కర్నూలు బిల్వమంగళుడిగా జిల్లా నాటకరంగానికి అపారమైన కీర్తి గడించి పెట్టిన బీసీ కృష్ణ(80) శనివారం సాయంత్రం కర్నూలు నగరంలో కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయన చికిత్సలు తీసుకుంటూ, కోలుకోలేక తుదిశ్వాస విడిచారు. కర్నూలు నాటక రంగానికి రాష్ట్రస్థాయిలో ఖ్యాతి తీసుకువచ్చిన ప్రముఖుల్లో ఒకరిగా ఆయన కీర్తి రంగస్థలం మీద శాశ్వతంగా విరాజిల్లుతూనే ఉంటుంది. నాలుగు దశాబ్దాలకు పైగా ఆయన చింతామణి నాటకంలో బిల్వ మంగళుడిగా వేలాది ప్రదర్శనలు ఇచ్చిన ఏకైక కళాకారుడు. ప్రముఖ హార్మోనిస్టు కేసీ శివారెడ్డి రూపొందించిన ఒక ఆణిముత్యంగా బీసీ కృష్ణ నిలిచిపోతారు. అప్పటి వరకు మంచి గాత్రంతో ఘంటసాలను మరపించే గాయకుడిగా పేరు తెచ్చుకుంటున్న బీసీ కృష్ణ ప్రతిభను కేసీ శివారెడ్డి చూసి పద్య నాటక రంగానికి ఆయనకు బాటలు పరిచారు. వాచకం, నటనా కౌశలం, అభినయ చాతుర్యాలను గుర్తించి కేవలం బీసీ కృష్ణ కోసమే పరమహంస నాట్య కళా సమితిని స్థాపించి, ఆనాటి విఖ్యాత నటులు కేవీ రాఘవరావు, బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రి వంటి వారిని కర్నూలుకు పిలిపించి, వారికి కర్నూలులో నివాసం కల్పించి బీసీ కృష్ణకు శిక్షణ ఇప్పించారు. అలా పద్య నాటక రంగంలో ఆరంగ్రేటం చేసిన బీసీ కృష్ణ మొదట సత్య హరిశ్చంద్రలో హరిశ్చంద్రునిగా, శ్రీకృష్ణ తులాభారంలో శ్రీకృష్ణునిగా నటించారు. అయితే చింతామణి నాటకంలో బిల్వ మంగళుని పాత్ర ఆయనకు ఎనలేని కీర్తి ప్రతిష్ఠలను తెచ్చిపెట్టింది. బీసీ కృష్ణ నెలలో 30 రోజులు చింతామణి నాటకం ఎక్కడో ఒకచోట ప్రదర్శనలు జరిగాయి.

పురస్కారాలు ఎన్నో..

బీసీ కృష్ణకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం నుంచి ఉత్తమ నటుడుగా పురస్కారం అందుకున్నారు. ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు చేతుల మీదుగా ఈ పురస్కారం ఆయన స్వీకరించారు. అలాగే టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన కందుకూరి పురస్కారం కూడా ఆయనకు లభించింది. అలాగే ఎన్నో కళాపరిషత్తుల పోటీలకు ఆయన న్యాయ నిర్ణేతగా వెళ్లి సత్కారాలు అందుకున్నారు. రాష్ట్రస్థాయిలో గొప్ప కళాకారునిగా గుర్తింపు పొందిన బీసీ కృష్ణ మృతి కళారంగానికి తీరని లోటని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కార్యవర్గ సభ్యులు కొనియాడారు. బీసీ కృష్ణ కుటుంబ సభ్యులకు వారు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. రాష్ట్రం ఒక గొప్ప రంగస్థల కళాకారుడిని కోల్పోయిందని టీడీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు పి. హనుమంతరావు చౌదరి కొనియాడారు. బీసీ కృష్ణ పార్థివ దేహానికి చౌదరితోపాటు పలువురు కళాకారులు నివాళులు అర్పించారు.



కవితలకు ఆహ్వానం

'యువకలం' శీర్షికకు యువకవుల నుంచి 15 లైన్లకు మించ కుండా కవితలను ఆహ్వానిస్తున్నాం. కవితలను పంపవలసిన చిరునామా... **'యువకలం' శీర్షిక, ఆంధ్రజ్యోతి (దినపత్రిక), ఇండస్ స్కూల్ పక్కన, గుత్తి రోడ్, పందిపాడు గ్రామం, కర్నూలు.**

నిబంధనలకు పాతర..!



మూతపడిన ఎయిర్ ఫిల్లింగ్ యంత్రం

- పెట్రోల్ బంకుల్లో అందని సేవలు
- కనీస వసతులు కల్పించని యజమానులు
- ఊసేలేని అధికారుల తనిఖీలు

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పెట్రోల్ బంకుల నిర్వహణలో మోసాలు పేట్రేగిపోతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెట్రోల్ బంకుల్లో వినియోగదారులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. ప్రమాణాలు కూడా పాటించడం లేదు. ఉచిత సేవలు కూడా అందించడం లేదు. తనిఖీలు చేయాల్సిన అధికారులు వాటిపై కన్నెత్తి చూడడం లేదు. జిల్లాలో పెట్రల్ బంకుల నిర్వాహకులు వినియోగదారులను అడ్డగోలుగా దోచుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. జిల్లా కేంద్రమైన కర్నూలుతో పాటు కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, ఆలూరు, మంత్రాలయం, పత్తికొండ, పాణ్యం నియోజకవర్గాల్లో వివిధ చమురు సంస్థలకు చెందిన పెట్రోల్ బంకులు 360 ఉన్నాయి. వీటిలో 90 శాతం బంకులలో కనీస వసతులు లేవు. ఎయిర్ ఫిల్లింగ్ పాయింట్లు అలంకారప్రాయంగా మారాయి. మరుగుదొడ్లు, తాగునీరు ప్రథమ చికిత్స కిట్లు తదితర సదుపాయాలు కొన్ని చోట్ల నామమాత్రంగా ఉన్నాయి. మరికొన్ని చోట్ల సదుపాయాలు అసలే లేవు. వీటి ఏర్పాటుకు పెట్రోలియం కంపెనీలే నిధులు సమకూర్చుతున్నప్పటికీ 90 శాతం వాటిలో అలాంటివేమీ కనిపించడం లేదు. కొన్ని చోట్ల తక్కువ ఇంధనం నింపుతూ గుట్టు చప్పుడు కాకుండా దోచేస్తున్నారనే బహిరంగంగా ఆరోపణలు ఉన్నాయి.

తాగునీటికి ఇబ్బందులు

పెట్రోల్ బంకులలో వినియోగదారులకు కచ్చితంగా తాగునీటి సౌకర్యం కల్పించాలి. జిల్లాలోని పలు బంకులలో దాహం వేస్తే తాగడానికి నీటి సదుపాయం కల్పించడం లేదని విమర్శలు ఉన్నాయి. వాహనచోదకులతోపాటు సాధారణ ప్రజలు సైతం పెట్రోల్‌లో మరుగుదొడ్లు వినియోగించుకోవచ్చు. జిల్లాలోని అనేక బంకుల్లో ఇవి ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి. కొన్ని చోట్ల తాళాలు వేసి సిబ్బంది మాత్రమే వాడుకుంటున్నారు.

నిబంధనల ప్రకారం నిర్వహణ ఉండాలి



నిబంధనల ప్రకారం పెట్రోల్ బంకుల నిర్వహణ ఉండాలి. అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవు. పెట్రోల్, డీజిల్‌లు నాణ్యత లోపం, నిబంధనలను పాటించడం లేదని ఎవరన్నా మా దృష్టికి తీసుకువస్తే వెంటనే తనిఖీ చేసి కేసులు నమోదు చేస్తాం.

-రఘువీరా, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి

సాంద్రతలో వ్యత్యాసం

పెట్రోల్, డీజిల్ సాంద్రతలో వ్యత్యాసాలు అనేక పెట్రోల్ బంకుల్లో కనిపిస్తున్నాయి. డెన్సిటీ వివరాలు తెలియజేసే మీటర్లు పని చేయడం లేదు. మరికొన్ని చోట్ల అసలు డెన్సిటీ మీటర్లు లేవు. సాంద్రత పెట్రోల్‌కు 720-775 కేజీ/ఎం3, డీజిల్‌కు 82-860కేజీ/ఎం3 ఉండాలి. వ్యత్యాసం ఉంటే నాణ్యత లోపం లేనట్టే. వీటిని జిల్లాలోని పలు బంకుల్లో కొలవడం లేదు.

ధూమపానం, సెల్ వినియోగం నిషేధం

బంకులలో ధూమపానం, సెల్ వినియోగం నిషేధం. చాలా మంది వాహనదారులు సెల్‌ఫోన్ మాట్లాడుతూ తమ తమ వాహనాలకు పెట్రోల్, డిజిల్ పోయించుకుంటున్నారు. ఇది అగ్ని ప్రమాదాలకు దారి తీస్తుంది. జిల్లాలోని పలుచోట్ల బంకుల్లో అగ్నిమాపక పరికరాలు కనిపించడం లేదు. మరికొన్ని చోట్ల ఇసుక బకెట్లతో సరిపెడుతున్నారు.

దిష్టిబొమ్మలా ఎయిర్ ఫిల్లింగ్ యంత్రాలు

పెట్రోల్ బంకుల్లోని ఎయిర్ ఫిల్లింగ్ యంత్రాలు దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్నాయి. వాహనదారుడు పెట్రోల్ నింపుకున్న అనంతరం గాలి కోసం నిమిత్తమై ఎయిర్ ఫిల్లింగ్ యంత్రం దగ్గరకు వెళితే పని చేయడం లేదని నిర్వాహకులు చెబుతున్నారు. మరికొందరు వాహనదారులు యంత్రాలు పని చేయకపోవడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు.

రీడింగ్ మోసాలు

వాహనాలకు పెట్రోల్ లేదా డీజిల్ నింపేటప్పుడు బంకులో తిరిగే మీటర్ రూపాయలు ఐదుకు మించి జంప్ కాకూడదు. అంతకుమించితే మోసం చేసినట్లే. జిల్లాలోని అనేక బంకుల్లో మీటర్లలో వ్యత్యాసం అధికంగా ఉంది. ఫలితంగా రీడింగ్ మోసాలతో వాహనచోదకులు నష్టపోతున్నారు.

లిట్మస్ పేపరుతో పరిశీలించాలి

పెట్రోల్ నాణ్యతపై వినియోగదారులకు సందేహాలు ఉంటే లిట్మస్ పేపరుతో పరీక్ష చేసి చూపాలి. అలా పరిక్షిస్తే నలుసులు, దుమ్ము కనిపించకూడదు. జిల్లాలో అనేక చోట్ల సిబ్బందికి లిట్మస్ పరీక్ష గురించి తెలియకపోవడం గమనార్హం.


తనిఖీలు శూన్యం

పెట్రోల్ బంకులలో అక్రమాలు జరుగుతున్నా తనిఖీ అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర స్థాయి అధికారుల ఆదేశాలతో తూతూ మంత్రంగా తనిఖీలు చేసి ఆ ఫొటోలు అంతర్జాలంలో నమోదు చేసి చేతులు దులుపుకోవడం మినహా చేసేదేమీ లేదని ఆరోపణలు ఉన్నాయి.



జీవితంలో ధ్యానం భాగం కావాలి

మంత్రి టీజీ భరత్



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ధ్యానం జీవితంలో భాగం కావాలని మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం రాత్రి నగరంలోని గాంధీనగర్‌లో గల ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో భగవంతుని ప్రదర్శన శాలలను ఆయన ప్రారంభించారు. ఈ ప్రదర్శన శాలలో విగ్రహాల కోసం టీజీవీ సంస్థల తరఫున రూ.5 లక్షలు గతంలో విరాళం ఇచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ మానసిక శారీరక ఆరోగ్యానికి ధ్యానం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ధ్యానం చేసేందుకు తగిన సమయం కేటాయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ బ్రహ్మకుమారీలు, బ్రహ్మకుమారులు పాల్గొన్నారు.

ప్రతిపక్షం మీద దుమ్మెత్తి పోయడం తగదు

మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి



మాట్లాడుతున్న బుగ్గన రాజేంద్రనాథరెడ్డి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో చిత్తశుద్ధి చూపని ప్రభుత్వం ప్రతిపక్షం మీద దుమ్మెత్తి పోస్తోందని, ఇది తగదని మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి విమర్శించారు. శనివారం ఎస్వీ కాంప్లెక్స్ సమావేశభవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రహ్మాండమైన మెజార్టీ వచ్చిన కూటమి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాల్సింది పోయి రాజకీయాలు చేయడం తగదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేద, మధ్య తరగతి వర్గాలకు ఊరట కలిగించే అంశాలు ఉండటం సంతోషకరమని అన్నారు. కేంద్రంలో ఏపీ నుంచి 16 మంది ఎంపీలు ఉన్నా రాష్ట్రానికి ఏం సాధించారని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ వర్గీయులపై వైసీపీ నాయకుల దాడి

సి.బెళగల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణదొడ్డి గ్రామంలో టీడీపీ వర్గీయులతో వైసీపీ నాయకులు ఘర్షణ పడ్డారు. శుక్రవారం రాత్రి వడ్డె చిన్న వెంకటేశ్ ఆటో తీసుకుని వస్తుండగా గ్రామంలో రోడ్డుపై పెండ్లి మెరవణి నిలబడి ఉంది. వెంకటేశ్‌కు దారి ఇవ్వకపోవడంతో మాటమాట పెరిగి ఘర్షణ పడ్డారు. వడ్డె చిన్న వెంకటేశ్ అలియాస్ గూనోడు, వడ్డె వెంకటేశ్ అలియస్ లిక్కొడుపై వైసీపీ నాయకులు కుక్కల తిమ్మన్న, మేకల రాముడు, నరసిముడు, రాముడు దాడి చేశారు. ఇందులో ఇరువురికి తలలకు బలమైన గాయాలయ్యాయని, ఇరు వర్గాలపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్, కోడుమూరు సీఐ తబ్రేజ్ గ్రామంలో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడి ఘర్షణలు తగవని చెప్పారు. గొడవలు పెట్టుకున్న వారిపై రౌడీ షీటర్లుగా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. ఆయన వెంట కోడుమూరు సీఐ తబ్రేజ్, ఎస్ఐ తిమ్మారెడ్డి, గూడూరు ఎస్ఐ తిమ్మయ్య ఉన్నారు.

మహిళ ఆత్మహత్య

పగిడ్యాల, ఫిబ్రవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు ప్రాతకోట గ్రామానికి చెందిన లక్ష్మీదేవమ్మ (43) శనివారం తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ముచ్చుమర్రి ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన స్వాములు, లక్ష్మీదేవి కూలీ పనులతో పాటు స్వాములు ట్రాక్టర్ డ్రైవరుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గత కొంత కాలంగా లక్ష్మీదేవి మానసిక పరిస్థితి సక్రమంగా లేకపోవడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై కత్తితో దాడి

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): నంద్యాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్ గేటు వద్ద జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి కత్తిపోట్లకు గురయ్యాడు. ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసుల వివరాలివీ.. నంద్యాల శివారు ప్రాంతంలోని నందమూరినగర్‌కు చెందిన గౌస్‌కు రోజాకుంట వీధికిచెందిన హరికి గతంలో నుంచే పాత తగాదాలున్నాయి. శనివారం సాయంత్రం ఆర్టీసీ బస్టాండ్ గేటువద్ద వీరిద్దరు పరస్పరం ఎదురుపడటంతో పాత విషయాల గురించి మాట్లాడుకుంటూ వీరి మధ్య ఘర్షణ తలెత్తింది. ఈ ఘర్షణలో హరిపై గౌస్ కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో హరి గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రానైట్ లారీల పట్టివేత

నందికొట్కూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి ఎలాంటి పన్నులు చెల్లించకుండా అక్రమంగా గ్రానైట్‌ను తరలిస్తున్న రెండు లారీలను సేల్స్ ట్యాక్స్, మైనింగ్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి పట్టుకున్నారు. శనివారం నందికొట్కూరు పట్టణంలో మైనింగ్ అధికారులు తనిఖీ చేశారు. బాపట్ల, చీమకుర్తి నుంచి రాజస్థాన్‌కు మాచర్ల మీదుగా గ్రానైట్ లారీలు వెళ్లాల్సి ఉంది. అయితే అక్కడి నుంచి చెక్‌పోస్టుల్లో తనిఖీలు ఉంటాయని భావించి దోర్నాల, ఆత్మకూరు నందికొట్కూరు, కర్నూలు మీదుగా 150 కిలో మీటర్లు ఎక్కువైనా హైదరాబాదు మీదుగా వెళ్తున్నారు. అది కూడా 3.35 టన్నులు అధిక బరువుతో లారీలు ఉన్నాయి. ఇంత బరువుతో ఘాట్‌రూట్‌లో వాహనాలు వెళ్లకూడదన్న నిషేధం ఉందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఈ తనిఖీల్లో ఎలాంటి బిల్లులు లేకపోగా, ఒకే లారికీ మూడు నెంబరు పేట్లు ఉండడాన్ని గమనించారు. నెంబరు ప్లేట్లు మారుస్తూ అక్రమంగా రాజస్థాన్‌కు రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఈ తనిఖీల్లో మైనింగ్ విజిలెన్స్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కమిషనర్ గాయత్రి, జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ రమణయ్య పాల్గొన్నారు.

యూట్యూబర్ అరెస్టు

కర్నూలు క్రైం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పలువురు రాజకీయ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ రమణను త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. కర్నూలులోని ఎ.క్యాంపునకు చెందిన యూట్యూబర్ రమణ ఇటీవల సోషల్ మీడియా వేదికగా పలువురిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఇది సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీంతో కొంత మంది త్రీటౌన్, వన్‌టౌన్, నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని రమణను అరెస్టు చేయగా జడ్జి రిమాండ్‌కు పంపినట్లు సీఐ శేషయ్య తెలిపారు.

మహా కుంభాభిషేకం ఆరంభం



యాగశాలలో హోమాలు చేస్తున్న దృశ్యం

ఉరుకుంద స్వామి సన్నిధిలో మొదలైన పూజలు

కౌతాళం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో 3రోజుల పాటు జరిగే మహా కుంభాభిషేక కార్యక్రమాలు శనివారం మొదలయ్యాయి. మొదటి రోజు దేవాలయంలో శైవాగమ శాస్త్ర ప్రవీణ ద్విసహస్రాధిక ప్రతిష్ఠాచార్య అల్లవరపు సుబ్రమణ్య దీక్షితావధాని వారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం మంగళవాయిద్యాలతో యాగశాల ప్రదక్షిణం, భూతబలి, అఖండ దీపారాధన, దీక్షాధారణ, త్రిశూలపూజ చేసి, మంగళహారతులు ఇచ్చారు. ఆలయ అధికారి డీసీ విజయరాజు, అర్చకులు ఈరప్ప స్వామి, మహాదేవ స్వామి, శివన్న స్వామి తదితరులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు ఏర్పాట్లు చేశారు. ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు ఆధ్వర్యంలో కౌతాళం సీఐ అశోక్ కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

రాష్ట్రపతికి లేఖలు

నందికొట్కూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం తమను క్రమబద్ధీకరించాలని, గ్రాట్యువిటీ అమలు చేయాలని శనివారం నందికొట్కూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అంగన్‌వాడీ సిబ్బంది సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రపతికి లేఖలు రాశారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పక్కీర్ సాహెబ్, రైతు సంఘం జిల్లా నాయకుడు రాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీలను నిర్లక్ష్యం చేస్తున్నాయని అన్నారు. అంగన్‌వాడీ సిబ్బందిపై పని భారం మోపడంతో ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు.

'సమస్యలు పరిష్కరించాలి'

పాములపాడు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేషనల్ హైవే నిర్మాణం నేపథ్యంలో పలు గ్రామాలలో తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య కాంట్రాక్టర్లకు, అధికారులకు సూచించారు. పాములపాడు గ్రామ శివారులో హైవేలో భాగంగా నిర్మిస్తున్న అండర్ పాస్ బ్రిడ్జి ఎత్తు పెంచాలని ప్రజలు నిరసన చేస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే బ్రిడ్జిని పరిశీలించారు. అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం ఎత్తు పెంచాలని, సర్వీస్ రోడ్డు నిర్మించాలని, పంటలకు నీరు పారేందుకు కల్వర్టు నిర్మాంచాలని, లేదంటే చుట్టుపక్కల 25 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని రైతులకు, ప్రజలకు హామీ ఇచ్చారు.

'తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలి'

పాములపాడు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మినుము పంటలో తెగుళ్ల నివారణకు థయో మెథాక్సికం 0.4 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయశాఖ అధికారి హేమలత సూచించారు. పెంచికలపల్లి గ్రామంలో శనివారం మండల వ్యవసాయశాఖ అధికారి ఫణీశ్వరరెడ్డి అధ్యక్షతన పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలపై అవగాహన

పాణ్యం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా, మోటార్ వాహన శాఖ ఆధ్వర్యంలో శనివారం ఆర్జీఎం కాలేజీలో రోడ్డు భద్రత నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు, బస్సు డ్రైవర్లకు అవగాహన కల్పించారు. రహదారి ప్రమాదాలను నివారించి ప్రయాణ భద్రతను మెరుగుపరచేలా ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ఎంత ముఖ్యమో అధికారులు వివరించారు. జీపీఎస్, డాష్‌కామ్, సీసీటీవీ కెమెరాలు కాలేజీ బస్సుల్లో అమర్చడం ఎంత అవసరమో వివరించారు. కార్యక్రమంలో రవాణా శాఖ అధికారి శ్రీకాంత్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, హెచ్‌వోడీ తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మసీదు నిధులను దారి మళ్లించిన వైసీపీ'



ఫిరోజ్‌ను సన్మానించిన కుబ్రా మసీదు కమిటీ సభ్యులు

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): నంద్యాలలో కుబ్రా మసీదు కమిటీకి కేటాయించిన నిధులను వైసీపీ హయాంలో దారి మళ్లించిందని మసీదు కమిటీ సభ్యులు ఆరోపించారు. శనివారం టీడీపీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ను స్థానిక కుబ్రా మసీదు కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ 2002లో అప్పటి ఎమ్మెల్యే ఎన్ఎండీ ఫరూక్‌కు బ్రా మసీదు నిర్మాణానికి స్థల సేకరణతో పాటు నిధులు కేటాయించి మసీదు నిర్మాణానికి సహకరించారని గుర్తు చేశారు. 2019లో ఫరూక్ రూ.25 లక్షలు మంజూరు చేయగా నిధులను వైసీపీ ప్రభుత్వం దారిమళ్లించి మసీదు అభివృద్ధిని అడ్డుకుందని ఆరోపించారు. ప్రస్తుతం కూడా మంత్రి ఫరూక్ మసీదు పునర్నిర్మాణానికి రూ. కోటి నిధులు మంజూరు చేశారని హర్షం వ్యక్తం చేశారు. నిధుల మంజూరులో ఎన్ఎండి ఫిరోజ్ సహకారం మరువలేనిదంటూ కమిటీ సభ్యులు ఫిరోజ్‌ను సన్మానించారు. కమిటీ అధ్యక్షుడు హఫీజ్ అంజాద్ బాషా సిద్దికి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

● పట్టణంలోని 4వ వార్డులో ఉన్న అయేశా లిల్ బనాత్ మదరసాను శనివారం టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ వ్యర్థాలతో కూడిన మదరసా రహదారిని శు భ్రం చేయించటంతో పాటు విద్యార్థులు ఆహ్లాదకర వాతావరణంలో చదివే వాతావరణానికి సహకరిస్తానని అన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి మజీద్, బింగుమళ్ల శ్యాంసుందర్ గుప్తా, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాశ్వత అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం(ఆత్మకూరు), ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకానికి తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాలోని మల్కాజ్‌గిరికి చెందిన ఎ.వివేక్ అనే భక్తుడు శనివారం రూ.1,00,120 విరాళం అందజేశారు. ఈ మేరకు సంబంధిత విరాళ సొమ్మును దేవస్థానం సహాయ కార్యనిర్వహణాధికారి స్వాములుకు అందజేశారు. భక్తులకు రసీసుతో పాటు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం, జ్ఞాపికను అందజేశారు.

'ఫార్మసిస్టులు నైపుణ్యాలను పెంచుకోవాలి'

పాణ్యం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఫార్మసీ విద్యార్థులు సామాజిక సేవా బాధ్యత కలిగి ఉండాలని, ఎప్పటికప్పుడు నైపుణ్యాలను పెంచుకోవాలని ఏపీ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ విలియం కేరి సూచించారు. శాంతిరాం ఫార్మసీ కళాశాలలో శనివారం సాంకేతిక నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సెంట్రల్ కౌన్సిల్ మెంబరు డాక్టర్ నిరంజన్‌బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్‌చెట్టి, డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, రాయలసీమ ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అలరించిన నిత్య కళారాధన



నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలం(ఆత్మకూరు), ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా దక్షిణ మాడవీధిలోని నిత్యాకళారాధన వేదికపై శనివారం శ్రీబాల త్రిపుర సుందరి కూచిపూడి నృత్యాలయం, నెల్లూరు వారితో సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. వినాయక కౌత్వం, క్షం నమఃశివాయ, శివతాండవం, బిల్వాష్టకం, కాలభైరవాష్టకం, అయిగిరినందిని తదితర అష్టకాలకు, గీతాలకు కళాకారులు నృత్యప్రదర్శనలు చేశారు. ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా నిత్య కళారాధనలో భాగంగా ప్రతిరోజు హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

పేదల సంక్షేమానికి సీఎం కృషి

పింఛన్ పంపిణీలో ప్రజాప్రతినిధులు



నంద్యాలలో పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి ఫరూక్



బండిఆత్మకూరులో అందజేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

నంద్యాల, మున్సిపాలిటీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పింఛన్ల పంపిణీ సమయంలో లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం కనిపించిందని, పేదల సంక్షేమానికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని రాష్ట్ర న్యాయ, మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. పట్టణంలోని 1వ వార్డులో శనివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పింఛన్‌ను పెంచిన ఘనత చంద్రబాబుదేనన్నారు. ఏటా రూ. 250 పెంచుతానన్న జగన్మోహన్‌రెడ్డి మాట త ప్పారన్నారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ ను పెంచటంతో పాటు ప్రతి నెలా 1వ తేదీనే ఇస్తున్నారన్నారు. మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

● వైసీపీ ఐదేళ్ల పాలనలో పబ్లిసిటీ తప్ప అభివృద్ధి శూన్యమని న్యాయ, మైనారిటీ శాఖ మంత్రి ఫరూక్ అన్నారు. పట్టణంలోని 1వ వార్డులో అసంపూర్తి నిర్మాణంతో ఉన్న నీళ్ల ట్యాంకును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తాము ఇచ్చిన హామీ మేరకు ట్యాంకు నిర్మాణాన్ని పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. మంత్రి వెంట కమిషనర్ నిరంజన్ రెడ్డి, కౌన్సిలర్ నాగార్జున, తెలుగు దేశం పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

బండిఆత్మకూరు: ప్రతి నెల ఒకటో తేదీ ఎన్టీఆర్ భరోసా పింఛన్ అందజేసి పేదల కళ్ళల్లో ఆనందం చూడటమే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయయని, పేదల సంక్షేమానికి ఆయన కృషి చేస్తున్నారని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. శనివారం బండిఆత్మకూరులో ఎంపీడీవో దస్తగిరి, ఏపీఎం రాజశేఖర్ రెడ్డితో కలిసి లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు. టీజీపీ చైర్మన్ కంచర్ల మనోహర్‌చౌదరి, శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ సభ్యుడు డాక్టర్ చిట్టిబొట్ల భరద్వాజశర్మ, టీడీపీ మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి, బైరెడ్డి సుబ్బారెడ్డి, లక్ష్మిరెడ్డి, జాకీర్‌ఖాన్, బుగ్గరాముడు, సర్పంచ్ రామచంద్రుడు, రామసుబ్బయ్య, బాబు, ఈశ్వర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, సాయిబాబారెడ్డి, మదనభూపాల్, బాలుడు, చలమయ్య, అబీద్, అంజాద్ పాల్గొన్నారు.

పాములపాడు: కుటుంబంలోని అవ్వతాతలకు పెద్ద కొడుకులా చంద్రబాబు నెలనెల పింఛన్లు అందిస్తుండంతో వారి కళ్ళల్లో ఆనందం వెల్లివిరిస్తోందని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. మండలంలోని క్రిష్ణానగర్, మద్దూరు గ్రామాలలో శనివారం టీడీపీ సీనియర్ నాయకుడు తిమ్మారెడ్డితో కలిసి ఇంటింటికి బైక్‌పై వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు. ఎంపీడీవో చంద్రశేఖర్, టీడీపీ నాయకులు జనార్దన్‌రెడ్డి, బండ్లమూరి వెంకటేశ్వర్లు, గోవింద్, లక్ష్మీకాంతరెడ్డి, బాలస్వామి, కృష్ణారెడ్డి, నారాయణ, నరసింహులు, నసురుల్ల, అల్లీ, ఎస్.అలీ, సిద్ద, డాక్టర్ వెంకటస్వామి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మద్దూరులో పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

5న ఫీజు పోరు: వైసీపీ



పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైసీపీ నాయకులు

నందికొట్కూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఫీజు బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఫిబ్రవరి 5న నిర్వహించే ఫీజు పోరును విజయవంతం చేయాలని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ధార సుధీర్ పిలుపునిచ్చారు. శనివారం అధ్యక్షులు అబ్దుల్లా ఆధ్వర్యంలో ఫీజు పోరుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ధార సుధీర్ మాట్లాడుతూ విద్యాదీవెనకు రూ.2800 కోట్లు, వసతి దీవెనకు రూ.1100కోట్లు మొత్తం రూ.3900 కోట్లు రాష్ట్రంలోని విద్యా సంస్థలకు చెల్లించాల్సి ఉందన్నారు. ఫీజు పోరుకు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు సురేష్ యాదవ్, వైసీపీ నాయకులు రమేష్ నాయుడు, నాగార్జునరెడ్డి, తిరుమలేష్‌రెడ్డి, జగదిరెడ్డి, కాటం వెంకటరమణ, ఉపేంద్రరెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు



సెమీ ఫైనల్‌లో తలపడుతున్న మణిపూర్, కేరళ జట్లు

నంద్యాల వైద్యం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జాతీయ జూనియర్ సెపక్ తక్రా సెమీ ఫైనల్ పోటీలో బాలుర విభాగంలో మణిపూర్, కేరళ జట్లు తలపడ్డాయి. హోరా హోరిగా జరిగిన ఈ పోరులో మణిపూర్ జట్టు కేరళ జట్టు పై 2-0 పాయింట్లతో గెలుపొంది ఫైనల్ కుచేరింది, మరో సెమీ ఫైనల్‌లో హర్యానా బీహార్ జట్లు తలపడనున్నాయి. అంతక ముందు జరిగిన క్వార్టర్ ఫైనల్ పోటీలో మణిపూర్ జట్టు నాగాలాండ్ జట్టుపై 2-1,హర్యానా జట్టు రాజస్థాన్ జట్టుపై 2-1, కేరళ జట్టు ఒరిస్సా జట్టుపై 2-1, బీహార్ జట్టు ఉత్తర ప్రదేశ్ జట్టుపై 2-0 పాయింట్లతో గెలుపొంది సెమీఫైనల్‌కు చేరుకున్నాయి.

● బాలికల విభాగంలో క్వార్టర్ ఫైనల్స్‌పోటీల్లో హర్యాణ జట్టు తెలంగాణ జట్టుపై 2-0, ఒరిస్సా జట్టు ఢిల్లీ జట్టుపై 2-0 బీహార్ జట్టు మహారాష్ట్ర జట్టుపై 2-0, మణిపూర్ జట్టు ఆంధ్ర ప్రదేశ్ జట్టు 2-0 పాయింట్ల ఆధిక్యంతో గెలుపొంది సెమీఫైనల్ చేరుకున్నాయి. సెమీ ఫైనల్ పోటీలో హర్యాణా, బీహార్ మధ్య, ఒరిస్సా - మణిపూర్ జట్ల మధ్య జరగనున్నట్లు రాష్ట్ర సెపక్ తక్రా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ కార్యదర్శి నిమ్మకాయల సుధాకర్‌లు తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్లు ఏపీ రెడ్డి, విశ్వనాథ్, నాగరాజు, రామ సుబ్బారెడ్డి, రాజు, వెంకటేష్, శివ తదీతరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు

పాణ్యం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పాణ్యం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యాయామ అతిథి అధ్యాపకుడిగా పని చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శివారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గంటకు రూ.400 చొప్పున వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఎంపిఈడీ కోర్సులో కనీసం 55 శాతం మార్కు లతో ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. డాక్టరేట్ నెట్, స్లెట్ అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తగిన సర్టిఫికెట్లతో ఈనెల 5వ తేదీన కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించా లన్నారు. మరిన్ని వివరాలకు 9866041775 నెంబరును సంప్రదించాలని సూచించారు.

'రేపటి సభను విజయవంతం చేయండి'

ఆత్మకూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): నెల్లూరులో సోమవారం జరిగే భారీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని సీపీఎం నాయకుడు రణధీర్ పిలుపునిచ్చారు. నెల్లూరులో జరుగుతున్న ఆ పార్టీ 27వ మహాసభల సందర్భంగా ఆత్మకూరులోని సీపీఎం కార్యాలయంలో శనివారం ఆ పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో నాయకులు రామ్ నాయక్, సురేంద్ర, వీరన్న, మాబాషా తదితరులు ఉన్నారు.

'ఆ నిర్ణయంతో ఎల్ఐసీకి నష్టం'

ఆత్మకూరురూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన మేరకు బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని 74 శాతం నుంచి వంద శాతానికి ఎఫ్డీఐని పెంచడం తగదని, ఇది ఎల్ఐసీకి నష్టదాయకమని ఆత్మకూరు ఎల్ఐసి ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌కుమార్, మనోజ్, జాయింట్ సెక్రటరీ నాగన్న ఓ ప్రకటనలో అన్నారు. ఇప్పుడు ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో బీమా రంగంలో తీసుకున్న నిర్ణయంతో విదేశి ఇన్సురెన్స్ కంపెనిలను నేరుగా ఆహ్వానించడంతో బీమా రంగానికి, పాలసీ దారులకు మేలు చేయదని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు బీమా రక్షణను విస్తరింపజేసి, పాలసీ దారులకు సకాలంలో చెల్లింపులు చేస్తూ, దేశాభివృద్ధికి నిధులను అందిస్తున్న ఎల్ఐసిని పరోక్షంగా ఈ నిర్ణయం దెబ్బతీస్తోందని తెలిపారు. ఈ నిర్ణయాన్ని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో బీమా రంగంలో ఎఫ్‌డీఐని పెంచుతూ, బీమా చట్ట సవరణ బిల్లు తీసుకు వస్తే ఉపేక్షించేది లేదని, ఇదే జరిగితే సమ్మెకైనా వెనుకాడబోమని హెచ్చరించారు.

'నామినేటెడ్ పోస్టుల్లో స్థానం కల్పించాలి'



మంత్రి ఫరూక్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న అభిరుచి మధు

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం త్వరలో భర్తీచేస్తున్న వివిధ నామినేటెడ్ నియామకాలలో బీజేపీ కార్యకర్తలకు కూడా అవకాశం కల్పించాలని బీజేపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు కోరారు. న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను శనివారం నంద్యాలలోని ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం భర్తీ చేసే వివిధ శాఖలలో భర్తీచేసే నామినేటెడ్ పోస్టులు గురించి చర్చించారు. బీజేపీ కార్యకర్తల వివరాలను మంత్రికి అందజేశారు. బీజేపీ నాయకులు కొశెట్టి చంద్రశేఖర్, ఉపేంద్రకుమార్‌రెడ్డి, బాలముని తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి: డీఎఫ్‌వో



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

మహానంది, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడాల్లోనూ రాణించాలని నంద్యాల డీఎఫ్‌వో అనురాగ్ మీనా ఆకాంక్షించారు. మహానంది సమీపంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ కళాశాలలో గత నాలుగు రోజుల నుంచి జరుగుతున్న రాష్ట్ర స్థాయి వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలల మధ్య క్రీడా పోటీలు శనివారం ముగిసాయి. ఇందులో ఓవర్ ఆల్ ఛాంపియన్‌షిప్‌ను (క్రీడల్లో) మారూటేరు వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు సాధించగా, ఓవర్ ఆల్ చాంపియన్ షిప్(సాంస్కృతిక)ను మడక శిర వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు కైవసం చేసుకున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.జయలక్ష్మి తెలిపారు. విజేత జట్లకు ప్రముఖులు బహుమతులు అందజేశారు. స్టూడెంట్ అఫైర్ డీన్ డాక్టర్ కరుణ సాగర్, డైరెక్టర్ ఆఫ్ డిప్లొమా కళాశాలల ఆఫీసర్ వెంకటేశ్వర్లు, నంద్యాల ఏడీఆర్ జాన్సన్, ఇన్‌చార్జి స్టూడెంట్ యాక్టివిటీస్ ఎల్.విజయ భాస్కర్, ఫిజికల్ డైరెక్టర్ రవికాంత్ రెడ్డి, శాస్త్రవేత్తలు శ్రీనివాసరెడ్డి, మాధవి, స్వరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ. 20.77 లక్షలు



ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది, స్వామి సేవకులు

పాణ్యం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి హుండీ లెక్కింపు శనివారం నిర్వహించారు. ఆలయ ఈవో రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన లెక్కింపులో రూ. 20,77,133 నగదు, 945 గ్రాముల వెండి వచ్చినట్లు ఈవో తెలిపారు. నంద్యాల మూలసాగరం సమూహ దేవస్థానాల ఈవో గోపి పర్యవేక్షణలో లెక్కింపు నిర్వహించారు. గత ఏడాది అక్టోబరు 29 నుంచి వచ్చిన హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు తెలిపారు. గ్రామ పెద్దలు మిలిటరీ సుబ్బారెడ్డి, శివరామిరెడ్డి, బాణ శ్రీనివాసరెడ్డి, ప్రధాన అర్చకులు వీరయ్య స్వామి, పురుషోత్తం, నంద్యాల శ్రీ బాలాజీ సేవా ట్రస్టు సభ్యులు, శ్రీరామ సేవా సమితి అధ్యక్షురాలు సుహాసిని, ఏఎస్ఐ రఫిక్, పీసీ సూర్య కుమార్ పాల్గొన్నారు.

'సరిహద్దులను గుర్తించాలి'

ఆత్మకూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): దోబీ ఘాట్ల ప్రదేశాన్ని పరిశీలించి సర్వే చేసి సరిహద్దులను గుర్తించాలని, అలాగే హద్దు రాళ్లను ఏర్పాటు చేసి ఆక్రమణలకు గురికాకుండా చర్యలు చేపట్టాలని తహసీల్దార్ రత్నరాధిక సర్వేయర్‌కు సూచించారు. ఇటీవల దోబీ ఘాట్ల ప్రదేశం ఆక్రమణలకు గురైందని, సరిహద్దులను గుర్తించాలని రజక సంఘం ప్రతినిధులు తహసీల్దార్‌కు విన్నవించారు. ఈ మేరకు తహసీల్దార్ శనివారం ఆత్మకూరు పట్టణ శివార్లలో కొత్తపల్లి రస్తాలో ఉన్న దోబీ ఘాట్లను పరిశీలించారు. ఆమె వెంట డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

'టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి'

పాణ్యం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి రామ్మోహన్‌నాయుడు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలలో భాగంగా కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు హామీ నిలబెట్టుకుందన్నారు. వైసీపీ ప్రభుత్వం హైకోర్టును కాదు గదా.. బెంచ్ ఏర్పాటు చేయడంలో విఫలమైందని మండిపడ్డారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం, బెంచ్ ఏర్పాటుకు పనుల వేగవంతం కావడం హర్షణీయమన్నారు.

రేపు జాబ్ మేళా

నంద్యాల విద్య, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. కళాశాల లో శనివారం సంబంధిత బ్రోచర్‌ను విడుదల చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కియా ఇండియా కెంపెనీ నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. డిప్లొమా, బిటెక్ అర్హత కలిగి ఉండి 18 నుంచి 27 ఏళ్ల వయసు ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'పొలం పిలుస్తోంది' వాయిదా: డీఏవో

నంద్యాల విద్య, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5న నిర్వహించాల్సిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖఅధికారి మురళీ కృష్ణ తెలిపారు. జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 5నవ్యవసాయ శాఖ అత్యవసర సమావేశం నేపథ్యంలో వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ నెల 6వ తేదీన కార్య క్రమం యథావిధిగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జూపాడుబంగ్లా గ్రామానికి చెందిన శేఖర్ అనే వ్యక్తి ఇంటికి వచ్చి ఎమ్మెల్యే జయసూర్య సీఎంఆర్ఎఫ్ కింద వచ్చిన రూ.40 వేల చెక్కును అందజేశారు. ఎంపీడీవో గోపికృష్ణ, తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఉపతహసీల్దార్ నాగన్న, యాదవసంఘం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వెంకటేశ్వర్లుయాదవ్, టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథరెడ్డి, సుధాకర్, పెద్దన్న, బాబు, రఘుయాదవ్, సుబ్బన్న, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

'పదోన్నతి కల్పించాలి'

నంద్యాల వైద్యం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం స్కూల్ అసిస్టెంట్ (వ్యాయామ విద్య) గా పనిచేస్తున్న అర్హత గలిగిన ఫిజికల్ డైరెక్టర్లకు పదోన్నతులు కల్పించి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అవకాశం ఇవ్వాలని నంద్యాల జిల్లా ఫిజికల్ డైరెక్టర్లు కోరారు. ఉపాధ్యాయ సంఘాల గౌరవ అధ్యక్షుడు, కడప జిల్లా ఒలంపిక్ సంఘం చైర్మన్ ఒంటేరు శ్రీనివాస రెడ్డికి శనివారం నంద్యాలలో వినతి పత్రం అందజేశారు. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఎంపీఈడీ ఫోరం సభ్యులు పి. విశ్వనాథ్. సి.నాగేంద్ర, దేవేంద్ర, నాగరాజు, భరత్ రెడ్డి, ఓబులేసు తదీతరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి దివ్యాంగుల క్రీడా పోటీలకు ఎంపిక

నంద్యాల వైద్యం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా మంగళగిరి పోలీస్ బెటాలియన్ మైదానంలో ఈ నెల నుంచి 2 నుంచి జరిగే రాష్ట్ర స్థాయి పారా స్పోర్ట్స్ దివ్యాంగుల క్రీడా పోలకు నంద్యాల జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు అధ్యక్ష, కార్యదర్శులు డా.రవికృష్ణ, రమణయ్య తెలిపారు. శారీరక దివ్యాంగులలో హనీఫ్ ఖాన్, భరత్, దుర్గారావు, అంధుల విభాగంలో శ్రీకాంత్, సోమేశ్వర రెడ్డి, విశ్వనాథ్, మహేష్ 100, 200 400 మీటర్ల పరుగు పందేలతో పాటు లాంగ్ జంప్, షాట్‌పుట్, జావెలిన్ త్రో విభాగాల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు క్రీడా దుస్తులు, రవాణా సౌకర్యం, ఎంట్రీ ఫీజులను జిల్లా సంఘం తరపున ఏర్పాటు చేశామని చెప్పారు. జనవరి 25వ తేదీన నంద్యాలలోని గురురాజ పాఠశాల మైదానంలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించి జిల్లా జట్లను ప్రకటించామన్నారు. కార్యక్రమంలో కోశాధికారి మధు, కార్యవర్గ సభ్యులు వీరభరతుడు, శివ రామిరెడ్డి తదీతరులు పాల్గొన్నారు.

'సెమినార్‌ను జయప్రదం చేయండి'

నంద్యాల వైద్యం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు ఏపీ పీఈటీ, ఎస్ఏ(పీఈ) అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర స్థాయి సెమినార్ కం టోర్నమెంట్‌ను జయ ప్రదం చేయాలని జిల్లా సంఘం అధ్యక్షుడు పి.ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి పి.రవి కుమార్, కోశాధికారి స్వామన్న, నాగశేషులు, శివకుమార్ పిలుపునిచ్చారు. పురుషుల విభాగంలో వాలీబాల్, కబడ్డీ, హ్యాండ్ బాల్, బాస్కెట్ బాల్, బాల్ బ్యాడ్మింటన్, క్రికెట్, హాకీ, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నీకాయిట్, స్విమ్మింగ్, అథ్లెటిక్స్‌లో పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. మహిళా విభాగంలో వాలీబాల్, త్రో బాల్, టెన్నీకాయిట్, హాకీ, షటిల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్‌లలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

వెలుగోడు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): వేల్పనూరు గ్రామంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా జూనియర్ ఎన్టీఆర్ క్యాలెండర్ ఆవిష్కరించారు. శనివారం ఎమ్మెల్యే స్వగృహంలో జూనియర్ ఎన్టీఆర్ యూత్ ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. యూత్ వలి, ప్రసాద్, సురేశ్, పవన్, వెంకటేశ్, సల్మాన్ రాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

పాణ్యం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని బలపనూరు సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడినట్లు పాణ్యం పోలీసులు తెలిపారు. గడివేముల మండలం గడిగరేవుల గామానికి చెందిన వెంకటరమణ, నంద్యాలకు చెందిన రమేష్ మోటారుసైకిల్‌పై వెళ్తూ ఎదురుగా వెళ్తున్న వాటర్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో ఇరువురు తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. క్షతగాత్రులను శాంతిరామ్ వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

మహానంది, ఫిబ్రవరి 31 (ఆంధ్రజ్యోతి): మసీదుపురానికి చెందిన సుధాకర్, హర్ష అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుం డడంతో టీడీపీ నాయకుడు, క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రమౌళీశ్వరరెడ్డి ఆర్థిక సాయం అందించారు. శనివారం నంద్యాల ఆసుపత్రిలో పరామర్శించిన అనంతరం వైద్య ఖర్చుల కోసం రూ.2 వేలు చొప్పున అందజేశారు.

'శ్మశానానికి ప్రహరీ నిర్మించాలి'

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): బండిఆత్మకూరు ఈద్గా సమీపంలోని శ్మశానానికి ప్రహరీ నిర్మించాలని ముస్లింలు కోరారు. శనివారం బండిఆత్మకూరుకు వచ్చిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఆక్రమణలు తొలగించి సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభించాలని ప్రజలు కోరగా.. అందరూ సహకరిస్తే రోడ్డుకు ఇరువైపులా ఆక్రమించిన 4 మీటర్ల స్థలం తీసుకుని రూ.40 లక్షల నిధులతో సీసీ రోడ్డు వేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తాగునీరు అందంటంలేదని రాజా వీధి ప్రజలు కోరగా.. వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఏఈ లక్ష్మీనరసింహను ఆదేశించారు. యూరియా కొరతతో ఇబ్బంది పడుతున్నామని, పెద్దలకు అందుతుందని రైతులు తెలపగా.. అందరికీ అందేలా చూడాలని ఏవో స్వాతిని ఆదేశించారు. కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, భరద్వాజశర్మ, నరసింహారెడ్డి, బుగ్గరాముడు, మశ్శేశ్వరరెడ్డి, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

'ప్రాథమిక పాఠశాలల విలీనం వద్దు'

ఆత్మకూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): సంస్కరణల పేరుతో ప్రభుత్వ పాఠశాలలను విలీనం చేసే నిర్ణయాన్ని విరమించుకోవాలని ఆత్మకూరు డివిజన్ విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్ షేక్ ఉమర్, ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కమతం శంకర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి డీటీ మనోహర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఏపీటీఎఫ్ నాయ కులు రామాంజనేయులు, అంబయ్య, రామమూర్తి, భాస్కర్, విధు భూషణ్, జక్కుందాసు, రవికుమార్, రామ్‌ప్రసాద్, వహీద్, రాజానాయక్ ఉన్నారు.

'అనుమతి ఇవ్వాలి'

ఆత్మకూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నల్లమల అటవీ ప్రాంతంలో దుకాణాల ఏర్పాటుకు అటవీ అధికారులు అనుమతులు ఇవ్వాలని గిరిజనులు కోరారు. శనివారం నాగలూటి, బైర్లూటి చెంచుగూడేలకు చెందిన గిరిజనులు ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ఈ ఏడాది దుకాణాలకు అనుమతించబోమని చెప్పారన్నారు. ఈ విషయంలో శ్రీశైలం ఐటీడీఏ అధికారులైనా స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

ఘనంగా హజరత్ అల్లా బకాష్ స్వామి ఉరుసు



అల్లాబకాష్ దర్గా స్వామిని దర్శించుకుని ఫతేహాల్ సమర్పిస్తున్న డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

బేతంచెర్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో వెలసిన హజరత్ అల్లాబకాష్ స్వామి ఉరుసు మతసామరస్యానికి ప్రతీకగా వైభవంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి గంధం, శనివారం ఉరుసు దర్గా ముజాఫర్ సయ్యద్‌షా గౌస్‌పీరా ఖాద్రి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ హాజరై స్వామివారికి ప్రత్యేకంగా ఫతేహాల్ సమర్పించారు. ఆమెతో పాటు టీడీపీ మండల కన్వీనర్ ఎల్లనాగయ్య కూడా స్వామివారికి పూజలు చేశారు. అనంతరం కోట్ల సుజాతమ్మ షటిల్ టోర్నమెంటు పోటీల కోర్టును ప్రారంభించారు. అలాగే రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిబండలాగుడు పోటీలను ప్రారంభించారు. రంగాపురం యూత్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'ఫీజు పోరుబాట'కు సిద్ధంకండి

● వైసీపీ నాయకుల పిలుపు

డోన్ రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆధ్వర్యంలో ఈ నెల 5న చేపడుతున్న ఫీజు పోరుబాట నిరసన కార్యక్రమానికి తరలి రావాలని ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుశేన్ పిలుపునిచ్చారు. శనివారం వైసీపీ కార్యాలయంలో ఫీజు పోరు వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలెక్టరేట్ వద్ద జరిగే ఆందోళన కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మల్లెంపల్లి రామచంద్రుడు, పట్టణ అధ్యక్షుడు హనుమంతరెడ్డి, వలంటీరీ విభాగపు జిల్లా అధ్యక్షుడు పోస్టు ప్రసాద్, యువ నాయకులు ఆర్ఈ రాజావర్ధన్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

● మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్ టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ లోన్లను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ రాజేష్ అధ్యక్షతన మెప్మా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21 ఏళ్ల నుంచి 60ఏళ్ల వరకు నిరుద్యోగ బీసీ, ఈబీసీ, కాపు వర్గాల వారికి సెల్ఫ్ ఎంప్లాయిమెంటు స్కీం 2024-25 సంవత్సరానికి 75 మందికి రూ.1,58,90,000ల కింద 50 శాతం సబ్సిడీ రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. బీసీ-ఏ (31), బీసీ-బి (9), బీసీ-డీ (10), బీసీ-ఈ (15) వర్గాల కింద వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హత కలిగిన వారు ఈ నెల 7వ తేదీలోపు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మెప్మా సీఎంఎం సుజాత తదితరులు ఉన్నారు.

వైభవంగా షిరిడీ సాయిబాబా మందిరం వార్షికోత్సవం

బేతంచెర్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని కర్నూలు రహదారిలో వెలసిన షిరిడి సాయిబాబా మందిరం 17వ వార్షికోత్సవ వేడుకలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం 7 గంటలకు సచ్చరిత పారాయణం, బాబావారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజ, కాకడ హారతులు నిర్వహించారు. 9 గంటలకు ఆలయంలో బాబా నిజపాద దర్శనం కల్పించారు. మధ్యాహ్నం భక్తులకు ఆలయ కమిటి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సాయికృపాదం కమటి సభ్యులు పట్టణ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

నేడు ఆళ్లగడ్డకు అహోబిలేశుడి పార్వేట పల్లకి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : అహోబిలం లక్ష్మీ నృసింహస్వామి పార్వేట పల్లకి పడకండ్ల నుంచి ఆదివారం ఉదయం ఆళ్లగడ్డకు చేరుకుంటుంది. స్వామివారి పల్లకి ఈ నెల 6 వరకు పట్టణంలోని పలు కాలనీల్లో ఆనవాయితీగా వస్తున్న తెలుపులపై కొలువు దీరనుంది. ఇళ్ల ముంగిటికి వస్తున్న జ్వాలా, ప్రహ్లాదవరదస్వామి ఉత్సవమూర్తులకు ఆళ్లగడ్డ ప్రజలు విశేష పూజలు నిర్వహించనున్నారు. పార్వేట పల్లకి వస్తున్న సందర్భంగా పట్టణంలో ఐదు రోజులపాటు తిరుణాల జరుగుతుంది. పట్టణంలో వాహనాల రాకపోకలకు, ప్రజలకు ఇబ్బందులు తెలత్తకుండా పోలీసు సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు చేపడుతున్నారు.

అనుమతులు తీసుకోవాలి

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, కటౌట్స్, ప్రధాన రహదారికి ఇరువైపులా, మధ్యలో వీధి మలుపుల్లో గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా ఏర్పాటు చేయరాదని పంచాయతీ ఈవోఆర్డీ ప్రకాశ్‌నాయుడు ప్రక టనలో తెలిపారు. కూల్‌డ్రింక్స్ షాపు, మద్యం దుకాణాలల్లో విచ్చలవిడిగా వాటర్‌ప్యాకెట్లు విక్రయిస్తున్నారన్నారు. ఫిబ్రవరి 10 తరువాత కోవెలకుంట్లలో ప్లాసిక్‌ను నిషేధిస్తున్నట్లు తెలిపారు. పట్టణ పరిశుభ్రతకు గ్రామ పెద్దలు నాయకులు, ప్రజాప్రతినిధులు , ప్రజలు ,మహిళలు విద్యార్థులు సహకరించాలని కోరారు.

పన్ను మినహాయింపుపై హర్షం

బనగానపల్లె, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు ఊహించని విధంగా పన్ను మినహాయింపు ఇవ్వడం హర్షణీయమని స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడు సతీశ్ అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఆయన మాట్లాడుతూ గతంలో కంటే మంచి నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం తీసుకుందని హర్షం వ్యక్తం చేశారు. గతపదేళ్లలో ఏప్రభుత్వం కూడా ఇటువంటి పన్ను మిన హాయింపు తీసుకు రాలేదన్నారు. ఉద్యోగుల తరుపున ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

ముగ్గురికి గాయాలు

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : అంకిరెడ్డిపల్లె సమీపంలో ఆర్టీసీ బస్సును లారీ ఢీకొని ముగ్గురికి గాయాలయ్యాయి. శనివారం సాయంత్రం బనగానపల్లె నుంచి తాడిపత్రి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. అయితే డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి పక్కకు తిప్పడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈఘటనలో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా, ఇరువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి.

ఇరువై ఏళ్లగా ఎదురు చూపు

● పెండింగ్‌లో కల్వర్టు నిర్మాణ పనులు
● 2600 ఎకరాలకు అందని సాగు నీరు
● అధికారుల నిర్లక్ష్యమేనంటున్న రైతులు

రుద్రవరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : చెంతనే సాగునీరున్నా పొలాలకు అందని వైనం. దాంతో రైతులు రోజూ మదనపడుతున్నారు. తెలుగుగంగ ప్రధాన కాల్వ నుంచి ఆయకట్టు భూములకు సాగు నీరందించేందుకు 2005లో బ్లాక్‌ఛానెల్ తవ్వకానికి టెండర్లు పిలిచారు. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టరు పనులు అసంపూర్తిగానే



24వ బ్లాక్ చానెల్‌కు కల్వర్టు నిర్మించాల్సిన ప్రాంతం ఇదే



24వ బ్లాక్ చానెల్‌లో సాగు నీరు

వదిలేశారు. నరసాపురం, ఆలమూరు గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డుపై కల్వర్టు నిర్మిస్తే బ్లాక్‌ఛానెల్ వెంట పొలాలు సస్యశ్యామలంగా మారుతాయి. ఈ బ్లాక్‌ఛానెల్ కింద సుమారు 2600ఎకరాల ఆయకట్టు ఉంది. 20 ఏళ్లుగా ఈ పనులు పెండింగ్‌లో పడ్డాయి. కేవలం అధికారుల నిర్లక్ష్యం శాపంగా మారిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వమైనా ఈ వేసవిలో కల్వర్టు నిర్మించి చివరి ఆయకట్టుకు సాగునీరు అందించాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఏఈ వినయ్ మాట్లాడుతూ కల్వర్టు నిర్మించాల్సిన ప్రాంతాన్ని పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

తాగునీటి ఎద్దడిని నివారించాలి

బేతంచెర్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి నగరపంచాయతీ కమిషనర్ హరిప్రసాద్‌కు ఆదేశించారు. రానున్న వేసవిలో సమస్య తీవ్రతరం అవుతుందని పట్టణ ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే ఎలాంటి చర్యలు తీసుకుంటే బేతంచెర్ల తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందో పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్‌ను తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాలతో నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ శనివారం తన సిబ్బందితో కలిసి తాగునీటి సమస్య పరిష్కారానికి తీసుకోవల్సిన చర్యలపై పలు ప్రాంతాలను పరిశీలించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి ఒక్కోటి ఐదు లక్షల లీటర్ల నీటి నిల్వ సామర్థ్యంతో భూగర్భ ట్యాంకర్లను నిర్మించి తద్వారా తాగునీటిని సరఫరా చేస్తే పరిష్కారం అవుతుందని గుర్తించారు. నీటి ట్యాంకర్లను ఏయే ప్రదేశాల్లో నిర్మిస్తే సౌకర్యంగా ఉంటుందనేది తెలుసుకునేందుకు పట్టణ శివారులో పలు ఖాళీ స్థలాలను పరిశీలించారు. ఈ స్థలాల్లో



ముచ్చట్ల రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ హరిప్రసాద్

తక్కువ ఖర్చుతో భూగర్భ నీటి నిల్వ ట్యాంకర్లను నిర్మించి సమస్యను పరిష్కరించవచ్చని ఆయన భావించారు. ఈ మేరకు తగిన ప్రతిపాదనలను సిద్ధం చేసి ఎమ్మెల్యేకు సమర్పిస్తామని ఆయన తెలిపారు. వీటితో పాటు పట్టణ పరిధిలో పైపులైన్లను, ఓవర్‌హెడ్ ట్యాంకులను పూర్తి స్థాయిలో పరిశీలించి వాటిని అవసరమైన మరమ్మతులకు సంబంధించిన చర్యలను తీసుకుని వాటికయ్యే ఖర్చు తదితర వివరాలను ఎమ్మెల్యేకు నివేదిక ద్వారా అందజేస్తామని తెలిపారు.

సామాజిక తనిఖీ గ్రామ సభలు

ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు ఉపాధి హామీ పథకం ద్వారా చేసిన ఖర్చులకు సంబంధించి సామాజిక తనిఖీ గ్రామ సభలు ప్రారంభమయ్యాయి. శనివారం మండలంలోని ఆరు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. మండలంలో గత ఆర్థిక సంవత్సరంలో రూ. 6.27 కోట్ల నిధులు ఖర్చు చేసినట్లు ఏపీవో రవిప్రకాష్ తెలిపారు. బోడెమ్మనూరు గ్రామంలో కొలతల్లో తేడాలు, గృహ నిర్మాణ బిల్లులు మంజూరులో వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. అలాగే కొండుపల్లె గ్రామంలో గ్రీన్ అంబాజిటర్లకు పనులు కల్పించటం, హరివరం గ్రామంలో వలంటీర్లకు మూడు రోజుల కంటే ఎక్కువ పనిదినాలు కల్పించటం, మాయలూరు, నర్సిపల్లె, పెద్దయమ్మనూరు గ్రామాల్లో పని ప్రదేశాల్లో నేమ్‌బోర్డులు ఏర్పాటు చేయకపోవటం, మొక్కలు చనిపోయి ఉండటం వంటి అంశాలను సామాజిక తనిఖీ బృందం



రికార్డులను తనిఖీ చేస్తున్న ఏపీవో రవిప్రకాష్

గుర్తించిందన్నారు. ఈ సభలకు పెద్దయమ్మనూరు, కొండుపల్లె గ్రామాల సర్పంచ్‌లు గైర్హాజరు అయ్యారు. కార్యక్రమంలో డీఆర్పీలు బాలకోటయ్య, జ్ఞానేశ్వర్, ఆయా గ్రామాల కార్యదర్శులు ఉన్నారు.

ఆళ్లగడ్డ నుంచి అమరావతి వరకు అభివృద్ధే ధ్యేయం

- ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



ఆళ్లగడ్డలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : ఆళ్లగడ్డ నుంచి అమరావతి వరకు అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. శనివారం పట్ట ణంలోని భూమా శోభానాగిరెడ్డి కాలనీలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను సహించలేక వైసీపీ నాయకులు గగ్గోలు పెడుతున్నారన్నారు. నాటి అరాచక వైసీపీ పాలనకు.. నేటి టీడీపీ సంక్షేమ పాలనకు మధ్య తేడాను ప్రజలు స్పష్టంగా గుర్తించారన్నారు. విజన్‌తో ఆలోచించే సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సంక్షేమం, అభివృద్ధిపై దృష్టిసారించామన్నారు. గత ఐదేళ్లలో ఆళ్లగడ్డలో మరుగునపడిన అభివృద్ధిని తాము చేసి చూపిస్తామని ఎమ్మెల్యే అఖిలప్రియ అన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: నిరుపేదలకు వరం ఎన్టీఆర్ భరోసా పింఛను అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని సంతపేటలో సచివాలయ ఉద్యోగులతో కలిసి ఆయన పింఛన్లు పంపిణీ చేశారు.

చాగలమర్రి: టీడీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా తెలిపారు. శనివారం చాగలమర్రి గ్రామంలోని చెంచు కాలనీలో పింఛన్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మౌళాలి, జెట్టి నాగరాజు, జల్సా గౌస్‌మొద్దీన్, రాజేంద్ర, వెంకటయ్య, రమేష్, గఫార్, ఫరూక్, సురేష్, కుమార్, వీరయ్య, అంకాల్, అబ్దుల్లా, మహమ్మద్ పాల్గొన్నారు.

రుద్రవరం: రుద్రవరం మండలంలో శనివారం పింఛన్లు పండుగలా పంపిణీ చేసినట్లు ఎంపీడీవో భాగ్యలక్ష్మి తెలిపారు. ఎర్రగుడిదిన్నె గ్రామంలో పింఛన్ల పంపిణీ ని ఆమె పరిశీలించారు.

కొలిమిగుండ్ల : మండలంలోని పలు గ్రామాలలో తెల్లవారుజామునే పింఛన్ పంపిణీ ప్రారంభించారు. మీర్జాపురం గ్రామంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం ఉదయం 5గంటలకే లబ్ధిదారుల ఇంటికెళ్లి పింఛన్ పంపిణీ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు పోరాటం: ఏపీటీఎఫ్

బనగానపల్లె, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఏపీ విద్యాపరిరక్షణ కమిటీ పిలుపు మేరకు బనగానపల్లె పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. సంస్కరణల పేరుతో ప్రభుత్వ పాఠశాలలను విలీనం చేసే నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కమిటీ కన్వీనర్, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి , రాష్ట్ర కార్యదర్శి మధుసూధన్‌రావు మాట్లాడుతూ జీవో 117 వల్ల ప్రాథమిక విద్య సర్వనాశనమైందన్నారు. కూటమి ప్రభుత్వం 117తో ప్రాథమిక విద్య పూర్తిగా నాశనమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాథమిక పాఠశాలలో మూడు, 4,5 తరగతులను ఆదర్శపాఠశాలల పేరుతో రెండుకిలోమీటర్ల దూరంలో ఉన్న వేరే పాఠశాలలకు తరలించడానికి సిద్ధం చేసిందని విమర్శించారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నతపాఠశాలలుగా చేయాలన్నారు. ఉన్నతపాఠశాలల



నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక, బోధనేతర సిబ్బందిపోస్టులను భర్తీఈ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు లింగమయ్య, సుబ్బరాయుడు, రామకృష్ణ, వెంకటకృష్ణుడు, రమేశ్, పోలియో నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామి సన్నిధిలో సుబ్బారెడ్డి దంపతులు

బేతంచెర్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన శ్రీమద్దిలేటి నరసింహ స్వామి, మహాలక్ష్మి అమ్మవార్లను ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులు శనివారం దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, కుంకుమార్చన పూజలు వేద పండితులచే నిర్వహించారు. ఆలయ ఈవో రామాంజనేయులు సుబ్బారెడ్డి దంపతులను సన్మానించి స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను, లడ్డూ ప్రసాదాలను అందజేశారు. అనంతరం క్షేత్రంలో సుబ్బారెడ్డి పెళ్లి రోజు వేడుకల సందర్భంగా టీడీపీ శ్రేణులు, అభిమానుల మధ్య కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్షావలి చౌదరి, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

డోన్ టౌన్: రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు అందించాలని రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి సీడ్స్ అధికారులను సూచించారు. శనివారం పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయం వద్ద ఉమ్మడి కర్నూలు జిల్లా సీడ్స్ మేనేజర్ ధనలక్ష్మి, సీడ్స్ సీనియర్ అసిస్టెంట్ రామచంద్రుడులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారు మాట్లాడుతూ 15 సంవత్సరాల తర్వాత సీడ్స్ కార్పొరేషన్ ఉద్యోగస్థులకు ప్రమోషన్ వచ్చేందుకు కృషి చేసిన ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.



మద్దిలేటి స్వామి క్షేత్రంలో తన సతీమణికి కేక్ తినిపిస్తున్న ధర్మవరం సుబ్బారెడ్డి దంపతులు

ఉద్యాన పంటలతో అధిక లాభాలు

డోన్ రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల సాగుతో రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని డోన్ ఉద్యాన వన శాఖ అధికారి జి.కళ్యాణి అన్నారు. శనివారం మండలంలోని కొచ్చెర్వు గ్రామంలో ఉల్లి నిల్వ గోదాముల నిర్మాణంపై రైతులకు అవగాహన కల్పించారు. 25 టన్నులు నిల్వ సామర్థ్యం ఉన్న గోదాముల నిర్మాణానికి ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇస్తుందన్నారు. కార్యక్రమంలో వీహెచ్ఏఏ మమత పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం

● కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త గార్లపాటి మద్దిలేటి

డోన్ రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందని కాంగ్రెస్ డోన్ నియోజకవర్గ సమన్వయకర్త గార్లపాటి మద్దిలేటి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ పరిస్థితి అత్యంత క్లిష్టకరంగా ఉందన్నారు. రాష్ట్రాన్ని ఆదుకుని అభివృద్ధికి కృషి చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం మొండి చేయి చూపిందన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆశాజనకంగా లేదన్నారు. తలసరి ఆదాయం పెంచే మార్గాలను చెప్పకుండా.. ప్రజల వినియోగం స్థాయిని పెంచుతామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

మెనూ తప్పనిసరి

చాగలమర్రి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పనిసరిగా పాటించాలని ఎంఈవో న్యామతుల్ల అన్నారు. శనివారం జ్ఞానాపురం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యమైన భోజనం, కోడిగుడ్లు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను తీర్చిదిద్దాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మస్తాన్ పాల్గొన్నారు.

శనగ పంట కోత ప్రయోగం

చాగలమర్రి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేవేముల గ్రామంలో శనివారం ఏవో రంగనేతాజీ పర్యవేక్షణలో శనగ పంట కోత ప్రయోగాన్ని ఏఈవో మంజుల చేశారు. లక్ష్మీదేవి అనే మహిళ సాగు చేసిన పంట పొలంలో 5ఇంటు5 పరిధిలో పం డిన శనగ విత్తనాలను కొలతలు తీయగా 3.8 కేజీలు వచ్చాయని ఏఈవో పేర్కొన్నారు. మొగిలి, మంచు వల్ల దిగుబడి తగ్గిందని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది మణి, శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

400 క్యూసెక్కుల నీరు విడుదల

చాగలమర్రి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజోలి ఆనకట్ట నుంచి కేసీ ప్రధాన కాలువకు 400 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు డీఈ పుల్లయ్య తెలిపారు. శనివారం చాగలమర్రి కేసీ సబ్‌చానల్‌ను పరిశీలించారు. అలాగే ఆనకట్ట వద్దగల నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. 1,200 క్యూసెక్కుల నీరు నిల్వ ఉందని అన్నారు. కేసీ ప్రధాన కాలువ నుంచి చివరి ఆయకట్టుకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. మార్చి చివరి వరకు కేసీ కాలువకు నీరు విడుదల చేస్తామని పేర్కొన్నారు. రైతులు నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆయన వెంట ఏఈ జమాల్‌వలి, సూపర్‌వైజర్ దస్తగిరి ఉన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

చాగలమర్రి, ఫిబ్రవరి 31 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పశుసంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్ తెలిపారు. శనివారం చాగలమర్రి పశువైద్య కేంద్రంలో పశువుల వ్యాధుల పట్ల రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్యులు సాయిబాబా, దీపకుమారి, రవింద్రారెడ్డి, పశువైద్య సిబ్బంది, గోపాలమిత్ర సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రానికి తాళం

రుద్రవరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న తిప్పారెడ్డిపల్లె ఆరోగ్య ఉప కేంద్రం తాళం శనివారం తీయలేదు. ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలో తిప్పారెడ్డిపల్లె, తిమ్మనపల్లె గ్రామాలు ఉన్నాయి. ప్రతిరోజూ ఉదయం 10గంటలకు తలుపులు తీయాలి. కానీ ఉదయం నుంచి మధ్యాహ్నం అయినా తాళం తీయకపోవడంతో మందుల కోసం వచ్చిన వారు వెనుదిరిగారు. ఈ విషయంపై వైద్యాధికారి బాబు మా ట్లాడుతూ అక్కడ పని చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ డీఎంవో ఆఫీసులో నివేదికలు ఇవ్వడానికి వెళ్లినట్లు తెలిపారు.

ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లపై వేటు

రుద్రవరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటకొండ ఫీల్డ్ అసిస్టెంట్ మోహనరాజ్, ఆలమూరు ఫీల్డ్ అసిస్టెంట్ నాగేంద్రను సస్పెండ్ చేస్తూ ఉపాధి హామీ పథకం పీడీ జనార్దన్‌రావు ఉత్తర్వులు జారీ చేసినట్లు శనివారం ఎంపీడీవో భాగ్యలక్ష్మి తెలిపారు. అలాగే శ్రీరంగాపురం ఫీల్డ్ అసిస్టెంటు పాములేటికి షోకాజ్ నోటీసు జారీ చేశామన్నారు. కోటకొండలో ఉ పాధి పనుల్లో అంగన్‌వాడీ ఆయాలకు పనిదినాలు కల్పించినట్లు వి చారణలో తేలిందన్నారు. అలాగే ఆలమూరు గ్రామంలో వీవోఏలకు పనిదినాలు కల్పించినట్లు తేలిందన్నారు. శ్రీరంగాపురంలో జాబ్‌కార్డులు మంజూరు చేయలేదని, విద్యార్థులకు పనిదినాలు కల్పించినట్లు విచారణలో తేలిందని ఎంపీడీవో వివరించారు. దాంతో ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

రేపటి నుంచి పింఛన్ల పరిశీలన


శిరివెళ్ల, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల్లో దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతూ ప్రభుత్వం నుంచి రూ.15 వేలు పింఛను పొందుతున్న 56మంది లబ్ధిదారులను రెండు రోజులపాటు వైద్య బృందం పరిశీలించనున్నట్లు ఎంపీడీవో శివమల్లేశ్వరప్ప శనివారం తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 3న గుంప్రమా న్దిన్నె, కోటపాడు, యర్రగుంట్ల గ్రామంలోని రెండు సచివాలయాలతో పాటు శిరివెళ్లలోని నాలుగు సచివాలయాల పరిధిలో ఉన్న 28 మంది లబ్ధిదారులను విచారిస్తారన్నారు. అలాగే 4న చెన్నూరు, బోయలకుంట్ల, గుండంపాడు, మహదేవపురం, గోవిందపల్లె గ్రామంలోని రెండు సచివాలయాల పరిధిలోని 28 మంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వైద్య బృందం వెళ్లి పరిశీలిస్తారన్నారు.

ఎ-గ్రేడ్ పీహెచ్‌సీగా కొలిమిగుండ్ల

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : కొలిమిగుండ్ల పీహెచ్‌సీ కేంద్రాన్ని ఏ-గ్రేడ్ పీహెచ్‌సీగా జిల్లా వైద్యశాఖ అధికారులు ప్రకటించారు. కొలిమిగుండ్ల పీహెచ్‌సీ కేంద్రం డా.హరిచరణ్‌రెడ్డి అందిస్తున్న సేవలతో ఏ-గ్రేడ్ పీహెచ్‌సీ గుర్తింపు రావడం పట్ల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

ముళ్ల కంపల మధ్య ఆర్‌బీకే

- పట్టించుకోని వ్యవసాయ శాఖ అధికారులు



చిన్నవంగలిలో ముళ్ల కంపల మధ్య ఉన్న ఆర్‌బీకే

చాగలమర్రి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నవంగలి గ్రామంలో రైతుల కోసం ఏర్పాటు చేసిన ఆర్‌బీకే ముళ్ల కంపల మధ్య నిరుపయోగంగా ఉంది. వైసీపీ ప్రభుత్వంలో రూ.21.80 లక్షలు నిధులు వెచ్చించి ఆర్‌బీకే భవనాన్ని నిర్మించారు. భవనం ప్రారంభించి సంబంధిత వ్యవసాయశాఖకు అప్పగించినా ప్రయోజనం లేకుండా పోయింది. భవనంలో విధులు నిర్వహించకపోవడంతో పరిసరాలు పిచ్చి మొక్కలు, ముళ్లపొదలతో నిండుకున్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి భవనాలు నిర్మించిన ఎలాంటి ప్రయోజనం లేకుండాపోయిందని పలువురు విమర్శిస్తున్నారు. ఆయా శాఖలు భవనాలు లేక అద్దె భవనాల్లో నిర్వహిస్తుంటే సొంత భవనం ఉన్నా వ్యవసాయశాఖ పట్టించుకోకపోవడం నిర్లక్ష్యమేనంటున్నారు. ముళ్లకంపలను తొలగించి భవనాన్ని వినియోగంలోకి తీసుకరావాలని రైతులు కోరుతున్నారు.